నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం

ఐటీ, ఫార్మా షేర్ల జోరు.. వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

విలేకరులు కావలెను...
సంచలన దినపత్రిక నిలువుటద్దం కు – తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా జిల్లాల వారీగా, మండలాల వారీగా పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్
9059548848

హైదరాబాద్. ఎడిటర్:- వై. రమ నాగరాజు సంపుటి:-32 సంచిక:-245 శనివారం 31-10-2026

అమెరికన్ల ఉద్యోగాలు విదేశీయులకు ఇస్తే ఊరుకోం

కంపెనీలకు వాన్స్ వార్నింగ్!

- విదేశీ కార్మికుల నియామకంలో వీసా మోసాలపై చర్యలు తీసుకుంటామన్న వాన్స్
- అమెరికన్లను తొలగించి విదేశీయులను నియమించే కంపెనీలను లక్ష్యంగా చేసుకున్నామని వెల్లడి
- తయారీ రంగంలో 670 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చినట్లు ప్రకటన
- ఓడరేవులు, చమురు శుద్ధి కేంద్రాలు, కర్మాగారాల విస్తరణతో స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ఆశాభావం
- యువతకు ఇళ్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టామని వెల్లడి

అమెరికన్ల ఉద్యోగాలను విదేశీ కార్మికులకు కట్టబెట్టే కంపెనీలపై చర్యలు తీసుకుంటామని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ - మిగతా 2 లో

ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఏ కూటమికీ రాని పూర్తి మెజారిటీ

- ఇజ్రాయెల్‌లో హంగ్.. అనిశ్చితిలో నెతన్యాహు భవితవ్యం కింగ్ మేకర్లుగా అరబ్ పార్టీలు!
- మ్యాజిక్ ఫిగర్ 61 సీట్లకు గాను 53 సీట్లకే పరిమితమైన నెతన్యాహు కూటమి
- 19 సీట్లతో కింగ్ మేకర్లుగా మారిన అరబ్ పార్టీలు
- ప్రభుత్వ ఏర్పాటుకు విపక్షాల మంతనాలు
- ఫలితాలను తారుమారు చేశారంటూ అరబ్ పార్టీలపై నెతన్యాహు ఆరోపణలు



ఇజ్రాయెల్ రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల తుది ఫలితాలు వెలువడగా, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించలేదు. దీంతో దేశంలో హంగ్ పార్లమెంట్ ఏర్పడింది. ప్రధాని - మిగతా 2 లో

మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల - మిగతా 2 లో

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీఅడ్డుకుంటోందని- మిగతా 2 లో

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది

- ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్
- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి

విక్రయ ప్రక్రియలో నిబంధనలు - మిగతా 2 లో

హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం అప్రమత్తమైన భారత సరిహద్దు జిల్లాలు

- భూటాన్‌లోని షింటాపు హిమ సరస్సు నుంచి ఉప్పొంగిన వరద నీరు
- ముందస్తు తరలింపుతో తప్పిన ప్రాణనష్టం
- బెంగాల్, అసోంలోని పలు జిల్లాలకు వరద హెచ్చరికలు
- సంకోశ్ నది పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన యంత్రాంగం
- భూటాన్‌లో సాగునీటి వ్యవస్థ దెబ్బతినగా, రహదారిపైకి వరద వ్యర్థాలు

హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం పొంచి ఉంది. భూటాన్‌లోని ఓ హిమ సరస్సు నుంచి- మిగతా 2 లో

అండమాన్ సముద్రంలో అల్పపీడనం ఏపీ తీరం వైపు పయనం!

- దక్షిణ అండమాన్ సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం
- అదే ప్రాంతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- రానున్న 24 గంటల్లో సుస్పష్ట అల్పపీడనంగా మారే ఛాన్స్
- పశ్చిమ వాయవ్య దిశగా కదులుతున్న వ్యవస్థ
- అమరావతి వాతావరణ కేంద్రం అధికారిక ప్రకటన



బంగాళాఖాతంలో మరోసారి వాతావరణ అలజడి మొదలైంది. దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం క్రమంగా పశ్చిమ వాయవ్య దిశగా కదులుతోంది. ఇది

నవంబర్ 1 ర్యాలీ వాయిదా వేయండి

- సోనియా గాంధీకి ఢిల్లీ వ్యాపారుల విజ్ఞప్తి
- దీపావళి సీజన్‌లో రూ.12,000 కోట్ల వ్యాపారంపై ప్రభావం పడుతుందని ఆందోళన
- ర్యాలీ వల్ల ట్రాఫిక్, సరుకు రవాణా స్తంభించిపోతాయని లేఖలో వెల్లడి
- వాయిదా కుదరకపోతే రాంలీలా మైదానం బదులు బురారీకి మార్చాలని సూచన

కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న రాంలీలా మైదానంలో తలపెట్టిన భారీ ర్యాలీని వాయిదా వేయాలని - మిగతా 2 లో

తుపాను బాధితుల కష్టం తెలుసు

- ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం: సీఎం చంద్రబాబు భరోసా
- పశ్చిమగోదావరి జిల్లాల్లో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం - మిగతా 2 లో

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

- హైదరాబాద్‌ను ముంచెత్తిన కుండపోత వర్షం
- ప్రధాన రహదారులన్నీ జలమయం
- పలు ప్రాంతాల్లో గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్
- ఇళ్లకు వెళ్లే వేళ ఉద్యోగులు, ప్రయాణికుల తీవ్ర ఇబ్బందులు
- ఎండ వేడిమి నుంచి నగరవాసులకు ఊరట

శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో - మిగతా 2 లో

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం
శనివారం 31-10-2026

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్ ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

మొదటిపేజీ తరువాయి – కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు. సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు

మొదటిపేజీ తరువాయి – కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

అండమాన్ సముద్రంలో అల్పపీడనం.. ఏపీ తీరం వైపు పయనం!

మొదటిపేజీ తరువాయి – రానున్న 24 గంటల్లో మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వాయుగుండం ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా పయనించే సూచనలు కనిపిస్తుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. వివరాల్లోకి వెళితే, నిన్న దక్షిణ అండమాన్ సముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం, శుక్రవారం ఉదయం 8:30 గంటల సమయానికి మరింత స్పష్టంగా రూపుదిద్దుకుని, దక్షిణ అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల సమీపంలో కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తోంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ అల్పపీడనం అక్టోబర్ 31వ తేదీ నాటికి ఆగ్నేయ బంగాళాఖాతం, దాన్ని ఆనుకుని ఉన్న అండమాన్ సముద్రం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతంలో ఒక వాయుగుండంగా కేంద్రీకృతం కానుంది. వాయుగుండంగా మారిన తర్వాత కూడా ఇది పశ్చిమ వాయవ్య దిశలోనే తన ప్రయాణాన్ని కొనసాగించి, రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపుగా కదిలే అవకాశం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ వాతావరణ పరిణామం ప్రభావంతో రానున్న రోజుల్లో ఏపీ తీర ప్రాంతాల్లో వాతావరణం మారే అవకాశం ఉంది. దీని కదలికలను, తీవ్రతను అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు జారీ చేసే అవకాశం ఉంది. వాయుగుండం తీరానికి ఎంత దూరంలో కేంద్రీకృతమవుతుంది, దాని ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందనే దానిపై రానున్న 48 గంటల్లో మరింత స్పష్టత రానుంది.

నవంబర్ 1 ర్యాలీ వాయిదా వేయండి

మొదటిపేజీ తరువాయి – ఢిల్లీ వ్యాపారులు, పారిశ్రామికవేత్తల సంఘం (సీటీఐ) కోరింది. దీపావళి పండుగ సీజన్‌లో ఈ ర్యాలీ వల్ల తమ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటాయని, రూ.10,000 కోట్ల నుంచి రూ.12,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీకి శుక్రవారం లేఖ రాసింది. సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ మాట్లాడుతూ.. తాము ర్యాలీకి వ్యతిరేకం కాదని, కేవలం దాని సమయంపైనే ఆందోళన చెందుతున్నామని స్పష్టం చేశారు. "నవంబర్ 6న ధనత్రయోదశి, 8న దీపావళి ఉన్నాయి. నవంబర్ 1 వ్యాపార సన్నాహాలకు అత్యంత కీలకమైన రోజు. ఆ రోజున 10 లక్షల మంది, 15,000 నుంచి 20,000 వాహనాలు ఢిల్లీ నగరంలోకి వస్తే, 20 ప్రధాన మార్కెట్లలో వ్యాపారాలు పూర్తిగా స్తంభించిపోతాయి. పండుగ పూట మా జీవనోపాధిని కాపాడాలని వినయంగా కోరుతున్నాం" అని ఆయన అన్నారు. ఈ ర్యాలీ వల్ల ఎదురయ్యే నాలుగు ప్రధాన సమస్యలను సీటీఐ తన లేఖలో ప్రస్తావించింది. పార్కింగ్ సౌకర్యాల కొరత, తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ, సరుకు రవాణాకు అంతరాయం, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారాలపై ప్రభావం వంటి అంశాలను వివరించింది. రాంలీలా మైదానంలో కనీసం 200 బస్సులకు కూడా పార్కింగ్ స్థలం లేదని, వేలాది వాహనాలను ఎక్కడ నిలుపుతారని ప్రశ్నించింది. రాంలీలా మైదానానికి 5 కిలోమీటర్ల పరిధిలోనే చాందినీ చౌక్, సదర్ బజార్, కన్నాట్ ప్లేస్, కరోల్ బాగ్, ఖరీ బావోలీ సహా 20 ప్రధాన మార్కెట్లు ఉన్నాయని సీటీఐ గుర్తుచేసింది. ఈ మార్కెట్లకు రోజుకు 5,000 ట్రక్కులు సరుకులను తీసుకురాగా, మరో 3,000 ట్రక్కులు దేశంలోని ఇతర ప్రాంతాలకు సరుకులను తరలిస్తాయని తెలిపింది. ర్యాలీ కారణంగా అక్టోబర్ 31 నుంచే రవాణా వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉందని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సీటీఐ రెండు డిమాండ్లను సోనియా గాంధీ ముందు ఉంచింది. మొదటిది, ర్యాలీని దీపావళి తర్వాత అంటే నవంబర్ 10 లేదా 11వ తేదీకి వాయిదా వేయడం. అది సాధ్యం కాకపోతే, ర్యాలీ వేదికను రాంలీలా మైదానం నుంచి బురారీ గ్రౌండ్‌కు మార్చాలని సూచించింది. బురారీలో 15,000 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం ఉందని పేర్కొంది. గతంలో రాహుల్ గాంధీకి మూడుసార్లు లేఖ రాసినా స్పందన రాలేదని బ్రిజేష్ గోయల్ తెలిపారు. రాజకీయ కార్యక్రమాల కోసం పండుగ సీజన్‌లో తమ వ్యాపారాలను బలిచేయవద్దని వ్యాపారులు కోరుతున్నారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం.. నగర జీవనం అస్తవ్యస్తం

మొదటిపేజీ తరువాయి – కూడిన భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వానతో నగర జీవనం అస్తవ్యస్తంగా మారింది. గంటకు పైగా ఏకధాటిగా వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో పలు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నగరంలోని ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట్, ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిల్మ్ నగర్ వంటి ప్రధాన ప్రాంతాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం రద్దీ సమయం కావడంతో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపయ్యాయి. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో పరిస్థితి తీవ్రంగా మారింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కేపీహెచ్‌బీ, మైండ్‌స్పేస్, ఐకియా మార్గాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. మాదాపూర్ సిటీ వైన్స్ వద్ద ప్రధాన రహదారి చెరువును తలపించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నుంచి సూరారం వరకు, షాపూర్ నుంచి గాజులరామారం వరకు కూడా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. వర్షానికి తడుస్తూ కొందరు ప్రయాణికులు మెట్రో పిల్లర్ల కింద తలదాచుకోగా, మరికొందరు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే చిక్కుకుపోయారు. ఉప్పల్, ఎల్బీనగర్, మణికొండ, రాయదుర్గం, రాజేంద్రనగర్ వంటి నగర శివారు ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించింది. అయితే, గత కొన్ని రోజులుగా నగరంలో తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనం కలిగించింది.

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం

మొదటిపేజీ తరువాయి – వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు. మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

ఇజ్రాయెల్ ఎన్నికల్లో ఏ కూటమికీ రాని పూర్తి మెజారిటీ

మొదటిపేజీ తరువాయి – బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని రైట్-వింగ్ కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల మ్యాజిక్ ఫిగర్‌ను అందుకోవడంలో ఈ కూటమి విఫలమైంది. సెంట్రల్ ఎలక్షన్స్ కమిటీ గురువారం విడుదల చేసిన తుది గణాంకాల ప్రకారం.. నెతన్యాహు కూటమి 53 స్థానాలకే పరిమితమైంది. మరోవైపు, విపక్ష కూటమి 48 సీట్లు గెలుచుకుంది. ఈ నేపథ్యంలో 19 స్థానాలను కైవసం చేసుకున్న అరబ్ పార్టీలు ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకంగా, కింగ్ మేకర్లుగా అవతరించాయి. నెతన్యాహుకు చెందిన లికుడ్ పార్టీ 27 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యాబలం మాత్రం కొరవడింది. ఈ ఎన్నికల ఫలితాలు నెతన్యాహు రాజకీయ భవిష్యత్తును ప్రమాదంలో పడేశాయి. ఒకవేళ ఆయన ప్రధాని పదవి కోల్పోతే, తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి ఉంటుంది. దీర్ఘకాలంగా ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలపై విచారణ వేగవంతం కావడమే కాకుండా, 2023 అక్టోబర్ 7న హమాస్ జరిపిన దాడికి సంబంధించిన భద్రతా వైఫల్యాలపై కూడా అధికారిక దర్యాప్తు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ కారణాల వల్లే అధికారంలో కొనసాగేందుకు ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని, ప్రభుత్వ ఏర్పాటుకు విపక్షాలు ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. నెతన్యాహు ప్రధాన ప్రత్యర్థి, మాజీ సైన్యాధిపతి గాడీ ఐసన్‌కోట్ కొన్ని షరతులతో అరబ్ పార్టీలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలిచ్చారు. పార్లమెంట్ స్పీకర్‌ను మార్చడంపై విపక్షాలు దృష్టి సారించాయి. ఈ విషయంపై చర్చించేందుకు విపక్ష కూటమి తమను సంప్రదించిందని, స్పీకర్ మార్పునకు తాము మద్దతిస్తామని అరబ్ నేత అహ్మద్ టిబి స్పష్టం చేశారు. మరోవైపు, ఎన్నికల ఫలితాలను అంగీకరించేందుకు నెతన్యాహు వర్గం సిద్ధంగా లేనట్లు కనిపిస్తోంది. విదేశీ సహాయంతో అరబ్ పార్టీలు ఎన్నికలను 'దొంగిలించాయని' నిరాధార ఆరోపణలు చేస్తోంది. అయితే, నెతన్యాహు తన ఓటమిని కప్పిపుచ్చుకునేందుకే అరబ్ జనాభాను లక్ష్యంగా చేసుకుని వారిని నిందిస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి. ఒకవేళ ఏ కూటమీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతే, వచ్చే ఏడాది ఆరంభంలో ఇజ్రాయెల్‌లో మరోసారి ఎన్నికలు జరగడం ఖాయం.

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది

మొదటిపేజీ తరువాయి – పాటించామని స్పష్టీకరణ ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ చైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

హిమాలయాల్లో ప్రకృతి ప్రకోపం.. అప్రమత్తమైన భారత సరిహద్దు జిల్లాలు

మొదటిపేజీ తరువాయి – ఒక్కసారిగా వరద నీరు ఉప్పొంగడంతో దిగువ ప్రాంతాల్లో ఆందోళన మొదలైంది. ఈ ప్రభావం భారత్‌పైనా పడే ప్రమాదం ఉండటంతో పశ్చిమ బెంగాల్, అసోం రాష్ట్రాల్లోని పలు జిల్లాలను అప్రమత్తం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

భూటాన్‌లో ఒక్కసారిగా వరద

భూటాన్‌లోని వాయవ్య ప్రాంతం గాసా జిల్లాలో ఉన్న షింటాఫు హిమ సరస్సు వద్ద గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సరస్సు నుంచి ఉప్పొంగిన నీరు మోచు నది మీదుగా దిగువ ప్రాంతాలకు ప్రవహిస్తోంది. ఈ వరదల కారణంగా గాసా త్సాచు ప్రాంతంలోని సహజ వేడి నీటి బుగ్గల వద్ద సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముందుగానే ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం జరగలేదు.

భారత్‌లోని జిల్లాలకు హెచ్చరిక

వరద నీరు భూటాన్‌లోని పునాఖా పట్టణానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీగాంగ్ ప్రాంతానికి చేరినట్లు సమాచారం. దీంతో దిగువ ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని భూటాన్ అధికారులు భారత్‌ను అప్రమత్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ కొండ ప్రాంతాలు, అలీపుర్‌దువార్, జల్‌పాయ్‌గురి జిల్లాలతో పాటు అసోంలోని ధుబ్రి జిల్లాలోనూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నదీ తీర ప్రాంతాలపై నిఘా

భూటాన్‌లో వరదల ప్రభావం సంకోశ్ నదిపై పడే అవకాశం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పశ్చిమ బెంగాల్‌లోని అలీపుర్‌దువార్ జిల్లాలో నదీ తీర ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అసోంలోనూ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. భూటాన్‌లో వరద ఉద్ధృతికి సౌర విద్యుత్తుతో పనిచేసే సాగునీటి వ్యవస్థ దెబ్బతింది. పునాఖా-గాసా రహదారిపైకి వరద వ్యర్థాలు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది.

తుపాను బాధితుల కష్టం తెలుసు

మొదటిపేజీ తరువాయి – వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.

పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. "ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. "రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తొలుత గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం" అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు భరోసా.. మత్స్యకారులకు హామీ

అనంతరం మొగల్తూరు మండలం మాత్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, "ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా" అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన, సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

నిలువుటద్దం

శనివారం 31-10-2026

కూకట్‌పల్లిలో వాస్టీ బేక్ హౌస్ ప్రారంభం..

ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్!

జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ వద్ద నూతన బేకరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి..

నిర్వాహకులకు శుభాకాంక్షలు.....

కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి):::కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని జేఎన్‌టీయూ మెట్రో స్టేషన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాస్టీ బేక్ హౌస్ (వస్తలీ బేక్ హౌస్) ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి బేక్ హౌస్‌ను ప్రారంభించారు.

తన మేనకోడలు ఏర్పాటు చేసిన నూతన వ్యాపార సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి, నిర్వాహకులకు అభినందనలు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వాస్టీ బేక్ హౌస్ వ్యాపార రంగంలో మంచి గుర్తింపు సాధించి, వినియోగదారుల ఆదరణతో దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. నూతన వ్యాపార సంస్థల ఏర్పాటుతో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, యువత వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగడం అభినందనీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సందడి

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకుడు సాధు ప్రతాప్ రెడ్డి, ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి, కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి బి. సంజీవ్ రావు, క్రిస్టియన్ ఫైనాన్స్ కమిటీ చైర్మన్ మేకల మైఖేల్, కూకట్‌పల్లి డివిజన్ సీనియర్ నాయకుడు కొండల్ రెడ్డి, ఏఎంసీ పనీంద్ర కుమార్, ఉమ్మడి కేపీహెచ్‌బీ డివిజన్ మాజీ అధ్యక్షుడు తమ్మినేని ప్రవీణ్ కుమార్, బాలాజీ నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్యాణ్ బాబు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వాస్టీ బేక్ హౌస్ నూతన ప్రస్థానం విజయవంతం కావాలని, వ్యాపారంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షించారు.

నగర రవాణాకు కొత్త దిశ....

సైబరాబాద్‌లో 'మూవ్స్ 2026' సందడి!

నవంబర్ 26 నుంచి 28 వరకు టీ-హబ్‌లో ప్రత్యేక ప్రదర్శన..

సురక్షిత, సమ్మిళిత, పర్యావరణహిత రవాణా వ్యవస్థే లక్ష్యం

విద్యార్థులు, ప్రజల కోసం వినూత్న ఆలోచనల పోటీ.....

సైబరాబాద్, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి):::వేగంగా విస్తరిస్తున్న సైబరాబాద్ నగరంలో రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు 'సైబరాబాద్ మూవ్స్ 2026' పేరుతో ప్రత్యేక ప్రదర్శన, చర్చా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో మూడు రోజుల పాటు సైబరాబాద్‌లోని టీ-హబ్ వేదికగా ఈ కార్యక్రమం జరగనుంది. సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే, పర్యావరణహితమైన, సమర్థవంతమైన రవాణా వ్యవస్థపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

సమాచార సాంకేతిక రంగం, ఐటీ ఆధారిత సేవలు, అంతర్జాతీయ సంస్థల సామర్థ్య కేంద్రాలు, ఔషధ పరిశ్రమలకు ప్రధాన కేంద్రంగా సైబరాబాద్ అభివృద్ధి చెందుతోంది. పెరుగుతున్న ఉద్యోగ అవకాశాలు, నివాస ప్రాంతాలు, ఆర్థిక కార్యకలాపాలకు అనుగుణంగా మెరుగైన రవాణా సదుపాయాలు, ప్రజా రవాణా అనుసంధానం, ఉద్యోగ కేంద్రాలకు సులభంగా చేరుకునే మార్గాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్, షిఫ్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఇనిషియేటివ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి.

ప్రజల భద్రతే రవాణా వ్యవస్థకు ప్రాధాన్యం

ఈ కార్యక్రమానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ మాట్లాడుతూ, నగరం విస్తరిస్తున్న కొద్దీ రవాణా వ్యవస్థ కేవలం ట్రాఫిక్ నియంత్రణకే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా, సులభంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా ఉండాలని అన్నారు.

ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడం, బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనను అలవర్చుకోవడం, ప్రభుత్వ శాఖలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. 'సైబరాబాద్ మూవ్స్' కార్యక్రమం వివిధ వర్గాల అభిప్రాయాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే వినూత్న ప్రయత్నమని తెలిపారు. సురక్షితమైన రహదారులు, అందరికీ అందుబాటులో ఉండే మెరుగైన రవాణా వ్యవస్థ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రవాణా అభివృద్ధికి సమిష్టి కృషి అవసరం

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి. సృజన మాట్లాడుతూ, నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజల రాకపోకల విధానాన్ని పునరాలోచించి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రవాణా వ్యవస్థను తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సురక్షితమైన, అందుబాటు ధరల్లో లభించే, అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన, పర్యావరణహిత రవాణా సదుపాయాలను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు.

వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కోసం 'సైబరాబాద్ కన్వర్జెన్స్' వేదికగా పనిచేస్తోందని తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ కూడళ్లను మెరుగుపరచడం, రహదారులను అభివృద్ధి చేయడం, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. 'సైబరాబాద్ మూవ్స్ 2026' ద్వారా ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ రవాణా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలతో మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో పాల్గొనాలని సూచించారు.

ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ, హైదరాబాద్ పట్టణాభివృద్ధి సంస్థ, రవాణా శాఖ, ఓపెన్ డేటా తెలంగాణ ప్రతినిధులు పాల్గొన్నారు.

నగర రవాణా సమాచారంపై ప్రత్యేక ప్రదర్శన

'సైబరాబాద్ మూవ్స్ 2026'లో భాగంగా నగర రవాణా వ్యవస్థకు సంబంధించిన సమాచారాన్ని భారీ పటాలు, గణాంక చిత్రీకరణలు, పరస్పర అనుసంధాన ప్రదర్శనల ద్వారా ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా వివరించనున్నారు. సందర్శకులు తమ నివాస ప్రాంతాలను పటాల్లో గుర్తించడం, ప్రతిరోజూ ప్రయాణించే మార్గాలను పరిశీలించడం, తమ ప్రయాణ అనుభవాలు నగర రవాణా వ్యవస్థతో ఎలా అనుసంధానమై ఉన్నాయో తెలుసుకోవడం వంటి అవకాశాలు కల్పించనున్నారు.

అలాగే ఉన్నతాధికారుల చర్చలు, రవాణా రంగ నిపుణుల అవగాహన సదస్సులు, ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో పాటు ప్రజల కోసం మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్‌ను కూడా ప్రారంభించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, పౌరులు రూపొందించిన వినూత్న ఆలోచనలను ప్రదర్శించనున్నారు.

ప్రభుత్వ విభాగాలు, పరిశ్రమల ప్రతినిధులు, పట్టణాభివృద్ధి నిపుణులు, విద్యాసంస్థలు, పౌర సమాజ సంస్థలు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి నగర రవాణా భవిష్యత్తుపై సమిష్టి చర్చలు జరపనున్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యమిస్తూ సురక్షితమైన, సమ్మిళితమైన, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే రవాణా వ్యవస్థ నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కార్యక్రమ వివరాలు:

కార్యక్రమం: సైబరాబాద్ మూవ్స్ 2026

తేదీలు: నవంబర్ 26, 27, 28, 2026

వేదిక: టీ-హబ్, సైబరాబాద్

మరిన్ని వివరాల కోసం: సైబరాబాద్ మూవ్స్ అధికారిక వెబ్‌సైట్ --- CyberabadMoves.in

ఓటు హక్కు పరిరక్షణకు కాంగ్రెస్ సమరశంఖం!

ఢిల్లీ మహా ర్యాలీకి కూకట్‌పల్లి కాంగ్రెస్ శ్రేణులు

పార్టీ నాయకులు, కార్యకర్తల బస్సులకు జెండా ఊపి ప్రారంభించిన బండి రమేష్........

కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి)::ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా, ఓటు హక్కుల రక్షణే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహించనున్న మహా నిరసన ర్యాలీకి కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లాయి. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వ కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సుల్లో పార్టీ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ఢిల్లీకి బయలుదేరారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల కమిషన్‌ను అడ్డుపెట్టుకుని ప్రజల ఓటు హక్కులను కాలరాస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే చర్యలకు పాల్పడుతోందని నిరసిస్తూ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి మద్దతుగా నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ, ×చీణ×ూ కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరిన ప్రత్యేక బస్సులకు బండి రమేష్ స్వయంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారిని ఘనంగా సాగనంపారు.

ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ఎన్నికల వ్యవస్థ పనిచేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువలను కాపాడటం, ప్రజల హక్కులను పరిరక్షించడం కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యాలని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యం.. ఓటు హక్కు రక్షణే సంకల్పం.. రాజ్యాంగ పరిరక్షణే పోరాటం! అనే నినాదంతో కాంగ్రెస్ శ్రేణులు ఢిల్లీ మహా ర్యాలీలో పాల్గొనేందుకు ఉత్సాహంగా బయలుదేరాయి.

ప్రకృతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత!

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం.......

కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి):::పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్తు సాధ్యమని, ప్రతి ఒక్కరూ పర్యావరణహిత అలవాట్లను జీవితంలో భాగంగా చేసుకోవాలని వక్తలు సూచించారు. కూకట్‌పల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైఫ్ సైన్సెస్ విభాగం, ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ సుస్థిరతపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. పి. నారాయణరావు, ఇంజినీర్లు జి. కొండలరావు, బి. ధన్య, నిర్మల సాంబమూర్తి పాల్గొని పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను వివరించారు. నీటి పొదుపు, కాలుష్య నియంత్రణ, ప్రకృతి వనరుల సంరక్షణ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎన్. చందన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణహిత అలవాట్లను పాటిస్తూ ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూసివేసిన రోడ్డును తెరిపించండి..

ప్రజల ఇబ్బందులు తొలగించండి!

కైత్లాపూర్ ఫేజ్-15 రోడ్డు సమస్యపై అధికారులకు యూత్ కాంగ్రెస్ నాయకుల వినతి.....

అధికారులను పంపించి సమస్యను పరిశీలించి, రోడ్డు తెరిపిస్తామని హామీ......

కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి)::కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని కైత్లాపూర్ ఫేజ్-15లో గత కొంతకాలంగా చిత్తరమ్మ గుడి, రెయిన్బో వైన్స్ వెనుకవైపు ఉన్న రోడ్డును మూసివేయడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన స్టేట్ యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ, సునీల్ యాదవ్ సంబంధిత అధికారులను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ ఐఏఎస్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులును కలిసి రోడ్డు మూసివేత కారణంగా స్థానికులు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. రోడ్డును తిరిగి తెరిపించి ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. వినతిపై స్పందించిన అధికారులు వెంటనే సంబంధిత సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించి, రోడ్డు మూసివేతకు గల కారణాలను పరిశీలించి, సమస్యను తెలుసుకుని రోడ్డును తెరిపించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న రోడ్డు సమస్యపై స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లిన యూత్ కాంగ్రెస్ నాయకుల చొరవపై స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నవంబర్ 1 నుంచి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ తరగతులు ప్రారంభం

డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ల విద్యార్థులకు కౌన్సెలింగ్ తరగతులు.........

హైదరాబాద్, అక్టోబర్ 30 (నిలువుటద్దం):::డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ మొదటి, మూడో, ఐదో సెమిస్టర్ల కౌన్సెలింగ్ తరగతులు నవంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డా. వై. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. సంబంధిత సెమిస్టర్లలో చదువుతున్న విద్యార్థులు తమకు కేటాయించిన అధ్యయన కేంద్రాల్లో నిర్వహించే కౌన్సెలింగ్ తరగతులకు హాజరుకావాలని ఆయన సూచించారు. విద్యార్థులు తరగతుల వివరాలు, ఇతర విద్యా సంబంధిత సమాచారం కోసం విశ్వవిద్యాలయ అధికారిక వెబ్‌సైట్ www.braouonline.in ను సందర్శించాలని లేదా తమ సంబంధిత అధ్యయన కేంద్రాలను సంప్రదించాలని తెలిపారు.

నేతాజీ నగర్‌లో డ్రైనేజీ సమస్యకు చెక్!

జలమండలి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించిన బేరి రామచందర్ యాదవ్......

గచ్చిబౌలి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి):::నల్లగండ్ల నేతాజీ నగర్ కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న స్థానికులకు కాలనీ అధ్యక్షుడు బేరి రామచందర్ యాదవ్ చొరవతో ఊరట లభించింది. డ్రైనేజీ నుంచి మురుగునీరు ఇళ్లలోకి చేరుతుండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని ఆయన జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై జలమండలి సూపర్‌వైజర్ సురేష్‌కు సమాచారం అందించడంతో ఆయన వెంటనే సిబ్బందిని కాలనీకి పంపించారు. కాలనీలోని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిశీలించిన సిబ్బంది, మురుగునీటి సమస్యను పరిష్కరించారు. కాలనీవాసుల ఇబ్బందులను గుర్తించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి కృషి చేసిన బేరి రామచందర్ యాదవ్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు శంకర్ నాయక్, దశరథ్ నాయక్, గణేష్ నాయక్, రాంబాబు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా నత్తనడకన రోడ్డు పనులు!

పనుల్లో వేగం పెంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

అధికారులకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం......

కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం ప్రతినిధి):: :::రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం బాలాజీనగర్ డివిజన్‌లోని వసుంధర ఆసుపత్రి వెనుక ప్రాంతంలో ఆయన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నుంచి హబీబ్‌నగర్‌కు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు నెమ్మదిగా సాగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచి నిర్ణీత సమయంలో రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు పనులు ఆలస్యం కావడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మంజూరైన రోడ్లకు సంబంధించి కొంతమంది మట్టి పోసి నాయకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. ఇటువంటి వ్యవహారాలను ప్రోత్సహించవద్దని, అక్రమ వసూళ్లకు వత్తాసు పలకకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌసుద్దీన్, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ చౌదరి, మూసాపేట డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ఆనందరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిప్పులాంటి నిజాల ప్రతిబింబం
నిలువుటద్దం

శనివారం 31-10-2026

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు!

కూకట్‌పల్లిలో వైద్య సంస్థలపై డీఎంహెచ్‌ఓ ఆకస్మిక తనిఖీలు

త్రిశూల్ డయాగ్నస్టిక్స్, వీఎంఆర్ ఆసుపత్రుల్లో స్కానింగ్ యంత్రాలు సీజ్.. గెలాక్సీ ఆసుపత్రికి షోకాజ్ నోటీసు.......



కూకట్‌పల్లి, అక్టోబర్ 30 (నిలువుటద్దం)::ప్రజారోగ్యం, రోగుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. వైద్య రంగంలో నిబంధనలను ఉల్లంఘించే ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డా. కె. ఆనంద్ తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా శుక్రవారం పలు వైద్య సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

త్రిశూల్ డయాగ్నస్టిక్స్‌లో లోపాల గుర్తింపు

కూకట్‌పల్లిలోని త్రిశూల్ డయాగ్నస్టిక్స్‌కు సంబంధించిన ప్రాంగణంలో నిర్వహించిన తనిఖీల్లో పలు లోపాలను అధికారులు గుర్తించారు. మెడిని కాస్మెటిక్ సర్జరీ క్లినిక్ పేరుతో ఉన్న అనుమతులకు, త్రిశూల్ పేరుతో నిర్వహిస్తున్న డయాగ్నస్టిక్ సేవలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. సిబ్బంది వివరాలు, కాలుష్య నియంత్రణ ధ్రువపత్రాలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా, అవసరమైన వివరాల సమర్పణలో లోపాలు ఉన్నట్లు వెల్లడైంది.అదేవిధంగా, అక్కడ టీఎంటీ, ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రంతో పాటు ఎక్స్‌రే యంత్రం, ఇతర వైద్య పరికరాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలను గుర్తించిన నేపథ్యంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని సీజ్ చేసినట్లు తనిఖీ వివరాల్లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై చట్టప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

గెలాక్సీ ఆసుపత్రికి షోకాజ్ నోటీసు

గెలాక్సీ లేజర్ సర్జరీ ఆసుపత్రిలో నిర్వహించిన తనిఖీల్లో తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ గడువు 2026 ఏప్రిల్ 23తో ముగిసినట్లు అధికారులు గుర్తించారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన పూర్తి పత్రాలను తనిఖీ సమయంలో సమర్పించలేదని తెలిపారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ధ్రువపత్రం, కాలుష్య నియంత్రణ పత్రాలు, రోగులకు అందుబాటులో ఉంచాల్సిన చికిత్సా ధరల పట్టిక వంటి అంశాల్లోనూ లోపాలు గుర్తించారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

వీఎంఆర్ ఆసుపత్రిలోనూ తనిఖీలు

వీఎంఆర్ హాస్పిటల్స్, మెటర్నిటీ (ఓబీజీ) అండ్ సర్జికల్ సెంటర్‌లోనూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పీసీపీఎన్‌డీటీ చట్టానికి సంబంధించిన అంశాలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా అల్ట్రాసౌండ్ యంత్రంపై స్కానింగ్ కార్యకలాపాలను గుర్తించిన అధికారులు, సంబంధిత నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో యంత్రాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో ఆసుపత్రి యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నిబంధనలు పాటించడం ప్రతి వైద్య సంస్థ బాధ్యత

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణను నిషేధించే పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని ప్రతి వైద్య సంస్థ తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం ప్రకారం అవసరమైన రిజిస్ట్రేషన్లు, అనుమతులు, సిబ్బంది వివరాలు, ఇతర రికార్డులను నిర్వహించడం ఆసుపత్రుల బాధ్యతని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోగులకు పారదర్శకమైన వైద్య సేవలు అందాలి

ప్రతి రోగికి అందుతున్న వైద్య సేవలు, చికిత్సకు సంబంధించిన సమాచారం, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, వాటి ధరల వివరాలు తెలుసుకునే హక్కు ఉందని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. ఆసుపత్రుల్లో అనుమతులు, రిజిస్ట్రేషన్లు, పరిశుభ్రత, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ లేదా స్కానింగ్ సేవలకు సంబంధించిన నిబంధనల ఉల్లంఘనలు కనిపించినా, వైద్య సేవల్లో నిర్లక్ష్యం లేదా ఇతర అవకతవకలు ఎదురైనా ప్రజలు మౌనంగా ఉండాల్సిన అవసరం లేదని పేర్కొంది.

ప్రజలు తమకు ఎదురైన సమస్యలు, గుర్తించిన లోపాలు, నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన వివరాలను ఆధారాలతో సహా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయానికి లిఖితపూర్వకంగా లేదా ఇమెయిల్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు తెలిపారు. అందిన ఫిర్యాదులను సంబంధిత నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, రోగుల భద్రతను పరిరక్షించడం, వైద్య రంగంలో పారదర్శకతను పెంపొందించడం లక్ష్యంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

డెంటల్ ఇంప్లాంట్ల మొండి ఇన్ఫెక్షన్లకు కారణమిదే.. శాస్త్రవేత్తల కీలక ఆవిష్కరణ

డెంటల్ ఇంప్లాంట్ల నుంచి వెలువడే టైటానియం కణాలు రోగనిరోధక శక్తిని దెబ్బతీస్తున్నాయని వెల్లడి

ఈ కణాలు బ్యాక్టీరియాను నాశనం చేసే రోగనిరోధక కణాల పనితీరును బలహీనపరుస్తాయి

దీనివల్ల మొండి ఇన్ఫెక్షన్లు, ఎముకల నష్టం జరుగుతున్నట్టు పరిశోధనలో గుర్తింపు

ఇంప్లాంట్లు సురక్షితమేనని, నిపుణుల సలహాలు పాటించడం ముఖ్యమని స్పష్టీకరణ

డెంటల్ ఇంప్లాంట్లు చేయించుకున్న వారిలో కొందరికి వచ్చే ఇన్ఫెక్షన్లు ఎందుకు అంత మొండిగా తయారవుతాయి? యాంటీబయాటిక్స్ వాడినా ఎందుకు తగ్గవు? అనే ప్రశ్నలకు అమెరికాలోని రట్జర్స్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సమాధానం కనుగొన్నారు. ఇంప్లాంట్ల నుంచి వెలువడే అతి సూక్ష్మమైన టైటానియం కణాలే రోగనిరోధక వ్యవస్థను దెబ్బతీసి, ఇన్ఫెక్షన్‌ను తీవ్రతరం చేస్తున్నాయని వారి పరిశోధనలో తేలింది. ఈ ఆసక్తికర అధ్యయనం 'పీఎన్ఏఎస్ నెక్సస్' అనే జర్నల్‌లో ప్రచురితమైంది.సాధారణంగా దంతాలు కోల్పోయిన వారికి డెంటల్ ఇంప్లాంట్లు ఒక మంచి పరిష్కారం. అయితే, వీటిని అమర్చుకున్న వారిలో దాదాపు 10 నుంచి 20 శాతం మంది పెరి-ఇంప్లాంటైటిస్ అనే ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారు. ఇంప్లాంట్ చుట్టూ ఉన్న చిగుళ్లు, ఎముకలకు సోకే ఈ ఇన్ఫెక్షన్ సాధారణ చిగుళ్ల వ్యాధి కంటే తీవ్రంగా ఉండి, ఎముకలను సైతం నాశనం చేస్తుంది.పరిశోధన ప్రకారం, ఇంప్లాంట్ ఉపరితలంపై బ్యాక్టీరియా ఒక పొరగా ఏర్పడుతుంది. ఇది నెమ్మదిగా లోహాన్ని దెబ్బతీసి, సూక్ష్మమైన టైటానియం కణాలను చుట్టుపక్కల కణజాలంలోకి విడుదల చేస్తుంది. బ్యాక్టీరియా విషపదార్థాలతో కూడిన ఈ కణాలు శరీరంలోని మాక్రోఫేజ్‌లు అనే రోగనిరోధక కణాల పనితీరును దెబ్బతీస్తాయి. మామూలుగా ఈ మాక్రోఫేజ్‌లు బ్యాక్టీరియాను గుర్తించి, వాటిని మింగేసి నాశనం చేస్తాయి. కానీ, టైటానియం కణాల ప్రభావానికి గురైనప్పుడు, వాటి పనితీరు మందగిస్తుంది. అవి బ్యాక్టీరియాను నాశనం చేయకపోగా, దీర్ఘకాలిక వాపునకు కారణమవుతున్నాయి. ఈ వాపు వల్ల ఇన్ఫెక్షన్ తగ్గకపోగా, ఇంప్లాంట్ చుట్టూ ఉన్న ఎముక దెబ్బతింటోంది.ఈ హానికరమైన ప్రక్రియలో ౧రాజ1 అనే ప్రొటీన్ ఛానెల్ కీలక పాత్ర పోషిస్తున్నట్టు పరిశోధకులు గుర్తించారు. జన్యుపరంగా ఈ ప్రొటీన్ లేని ఎలుకలపై ప్రయోగాలు చేసినప్పుడు, వాటిలో వాపు తక్కువగా ఉండటంతో పాటు ఇన్ఫెక్షన్లను సమర్థంగా ఎదుర్కొన్నాయి. దీని ఆధారంగా భవిష్యత్తులో కేవలం యాంటీబయాటిక్స్‌పై కాకుండా, రోగనిరోధక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని కొత్త చికిత్సలు అభివృద్ధి చేసే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.అయితే, ఈ పరిశోధన ఫలితాల ఆధారంగా డెంటల్ ఇంప్లాంట్లు సురక్షితం కాదని భావించరాదని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. చాలా మందిలో ఇవి విజయవంతంగా పనిచేస్తున్నాయని గుర్తుచేశారు. ఈ సమస్యలు రాకుండా ఉండటానికి ఉత్తమ మార్గం క్రమం తప్పకుండా దంత వైద్యులను సంప్రదించడం, ప్రొఫెషనల్ క్లీనింగ్ చేయించుకోవడమేనని వారు సూచిస్తున్నారు.

జర్నలిస్టుల స్థలాన్ని లాక్కోవడం అన్యాయం!

హామీలు ఇచ్చి.. ఉన్న స్థలాన్నే స్వాధీనం చేసుకుంటారా?

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై స్పష్టమైన విధాన ప్రకటన చేయాలి: టి యు డబ్ల్యూ జె ....

హైదరాబాద్ నిలువుటద్దం అక్టోబర్ 30:::::జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీలు ఇస్తూ, గతంలో వారికి కేటాయించిన స్థలాన్ని సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం అన్యాయమని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఖఔజే) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడటం ఏమిటని సంఘం అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ప్రశ్నించారు.జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ సభ్యుల కోసం గతంలో నిజాంపేటలోని సర్వే నంబర్ 332లో కేటాయించిన 32 ఎకరాల స్థలాన్ని గురువారం పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకొని సీజ్ చేయడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుమారు 18 ఏళ్ల క్రితమే కోట్లాది రూపాయలు చెల్లించిన సొసైటీ సభ్యులకు ఇప్పుడు ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని నిలదీశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారం కాలేదని వారు విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి కేటాయించిన నిజాంపేట స్థలాన్ని సైతం ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం జర్నలిస్టులను మోసం చేయడమేనని ఆరోపించారు.

హామీల్లో స్పష్టతేది.. ఆచరణలో చిత్తశుద్ధేది?

నెల రోజుల క్రితం రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దీపావళికి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని ప్రకటించారని, తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో డిసెంబర్ 9న ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ప్రకటించారని వారు గుర్తుచేశారు. ఒకవైపు వేర్వేరు ప్రకటనలు చేస్తూ మరోవైపు గతంలో కేటాయించిన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం పరస్పర విరుద్ధ చర్యలకు నిదర్శనమని విమర్శించారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ముఖ్యమంత్రి పలుమార్లు హామీ ఇచ్చినా, ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోవడంపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. పైగా వందల కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని స్వాధీనం చేసుకోవడం ప్రభుత్వ చిత్తశుద్ధిపై అనుమానాలకు తావిస్తోందన్నారు.

మాటలు కాదు.. చేతల్లో చూపించాలి!

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపుపై చిట్‌చాట్‌లలో ప్రకటనలు చేయడం కాకుండా, ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని రూపొందించి అధికారిక పత్రం రూపంలో ప్రకటించాలని అల్లం నారాయణ, ఆస్కాని మారుతి సాగర్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఎప్పుడు, ఎక్కడ, ఏ విధంగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు.ప్రభుత్వం అధికారికంగా విధాన ప్రకటన చేసి, ఇచ్చిన హామీలను అమలు చేసినప్పుడే జర్నలిస్టులకు నమ్మకం కలుగుతుందని వారు స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కులను కాపాడటంతో పాటు, గతంలో స్థలాల కోసం డబ్బులు చెల్లించిన సొసైటీ సభ్యులకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సెంటుతో చేటు

ఇంటి నుంచి బయటికి అడుగెయ్యాలంటే.. ఒంటికి సెంటు కొట్టాల్సిందే. చెమట వాసన రావొద్దన్నా, శరీరం సువాసనలు వెదజల్లాలన్నా.. బాడీ మొత్తం 'బాడీ స్ప్రే' చేసుకోవాల్సిందే! శరీరమే కాదు.. గది కూడా కమ్మటి వాసనలతో నిండిపోవాలని రూమ్ స్ప్రేలూ వాడేస్తున్నారు. ఈ సువాసనలు మనసుకు హాయినిస్తాయి. కానీ, ఆరోగ్యానికి చేటు తెస్తాయి. ఇప్పుడొస్తున్న అనేక రకాల పర్ఫ్యూమ్స్, రూమ్ ఫ్రెష్‌నర్ల తయారీలో ప్రమాదకర రసాయనాలను వాడుతున్నారు. విభిన్నమైన సువాసనల కోసం, అవి ఎక్కువ సమయంపాటు తాజాగా ఉండటం కోసం.. బెంజీన్, ట్కస్టెరిన్, ఫార్మాల్డిహైడ్, థాలేట్స్, వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్ లాంటివి విరివిగా కలిపేస్తున్నారు. ఈ రసాయన సమ్మేళనాలు శ్వాసకోశ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. కొన్ని చర్మానికి హాని చేస్తే.. మరికొన్ని క్యాన్సర్‌కు దారితీస్తాయి.

బెంజీన్: బాడీ స్ప్రే సువాసనలు ఎక్కువ సమయంపాటు శరీరంపై ఉండేందుకు 'బెంజీన్' అనే రసాయనాన్ని వాడతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే బెంజీన్‌ను 'కార్సినోజెన్'గా ప్రకటించింది. అంటే.. దీనిని దీర్ఘకాలంపాటు వాడితే క్యాన్సర్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

స్టైరిన్: ఇది ఓ క్యాన్సర్ కారకం. శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. చికాకును కూడా కలిగిస్తుంది.

థాలేట్స్: సువాసనలు ఎక్కువసేపు ఉండేందుకు ఎయిర్ ఫ్రెష్‌నర్లలో వీటిని వాడుతుంటారు. ఇవి మహిళల్లో హార్మోన్ల అసమతుల్యతను ప్రేరేపిస్తాయి. ఫలితంగా.. సంతాన సమస్యలు పెరుగుతాయి. పిండాల ఎదుగుదలపైనా ప్రభావం చూపుతాయి.

ఎసిటాల్డిహైడ్: ఇది నాడీవ్యవస్థ, శ్వాసకోశ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. దీర్ఘకాలంలో క్యాన్సర్‌కు దారితీస్తుంది. వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్స్: వీటిని ఎక్కువగా రూమ్ ఫ్రెష్‌నర్ల తయారీలో వాడుతారు. ఇవి శ్వాసకోశ సమస్యలతోపాటు కళ్లు, ముక్కు, గొంతు భాగాల్లో చికాకు కలిగిస్తాయి.

పిల్లల ఊపిరితిత్తులపై పొగమంచు పంజా.. దీర్ఘకాలిక ముప్పు తప్పదంటున్న వైద్యులు!

కాలుష్యం వల్ల పిల్లల ఊపిరితిత్తుల ఎదుగుదల దెబ్బతింటుందని వైద్యుల హెచ్చరిక

ఆరోగ్యంగా కనిపించినా దీర్ఘకాలిక ప్రభావం తప్పదని స్పష్టీకరణ

పెద్దలతో పోలిస్తే పిల్లలపై కాలుష్య ప్రభావం చాలా ఎక్కువంటున్న నిపుణులు

పొగమంచు ప్రభావం సిగరెట్ తాగడంతో సమానమని నిపుణుల ఆందోళన

దేశంలో పెరుగుతున్న పొగమంచు, వాయు కాలుష్యం పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యంగా కనిపించినప్పటికీ, కాలుష్యానికి నిరంతరం గురవడం వల్ల వారి ఊపిరితిత్తుల ఎదుగుదలపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుందని, ఇది భవిష్యత్తులో తీవ్ర సమస్యలకు దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పెద్దలతో పోలిస్తే పిల్లల ఊపిరితిత్తులు సున్నితంగా ఉంటాయి. అవి యుక్తవయస్సు వచ్చే వరకు ఎదుగుతూనే ఉంటాయి. అంతేకాకుండా, పిల్లలు వారి శరీర పరిమాణంతో పోలిస్తే వేగంగా శ్వాస తీసుకుంటారు. దీనివల్ల ఎక్కువ మోతాదులో కాలుష్య కారకాలు వారి శరీరంలోకి ప్రవేశిస్తాయి. గాలిలోని ౧ావీ2.5 వంటి సూక్ష్మ ధూళి కణాలు ఊపిరితిత్తుల లోపలికి సులభంగా చేరి, వాపు, మంటకు కారణమవుతాయి.కాలుష్య ప్రభావం వెంటనే బయటపడకపోయినా, ఊపిరితిత్తుల ఎదుగుదల, శ్వాస సామర్థ్యంపై ప్రభావం చూపుతుందని, ఈ నష్టం యుక్తవయస్సులో కూడా కొనసాగుతుందని అంటున్నారు వైద్య నిపుణులు. తరచూ కాలుష్యానికి గురవడం వల్ల పిల్లల్లో దగ్గు, జలుబు, ఆయాసం, ఆస్తమా వంటి సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ కూడా ఇదే విషయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో వాయు కాలుష్యం పిల్లల ఊపిరితిత్తుల ఎదుగుదలను కుంటుపరుస్తోందని, ఇది వారి అభ్యసన సామర్థ్యాన్ని కూడా దెబ్బతీస్తుందని అన్నారు. అధిక కాలుష్యానికి ఎక్కువ కాలం గురవడం అనేది సిగరెట్లు తాగడంతో సమానమని ఆమె పోల్చారు. ఈ నేపథ్యంలో, పిల్లల్లో దీర్ఘకాలిక దగ్గు, ఆడుకునేటప్పుడు ఆయాసం, రాత్రిపూట ఇబ్బందులు, ఆస్తమా లక్షణాలు పెరగడం వంటివి గమనిస్తే తల్లిదండ్రులు వెంటనే అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు.

Printed, Published and owned by Y. Ramadevi on behalf of NAGAPUBLICATIONS and printed of Koushik Printers, Vidya Nagar, Hyderabad
Published.... 3/5, MIG Flats, KPHB, Hyderabad 500072, Editor Y. Nagaraju, Ph. No. 9059548848 RNI:APTEL/2001/14027